# Eenadu

# ‘టెట్’పై పునరాలోచన?

- అవసరం లేకున్నా విడిగా నిర్వహణ
- డీఎస్సీతో కలిపి ఒకే పరీక్షగా నిర్వహించే అవకాశాన్ని పరిశీలించని విద్యాశాఖ

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)పై ప్రభుత్వంలో పునరాలోచన మొదలైందా? గురుకుల విద్యాలయాలతోపాటు, ఉపాధ్యాయ నియామకాలకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం లోపల, బయట ఇదే విషయం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఉపాధ్యాయ నియామక పరీక్షకు(డీఎస్సీ) ప్రాథమిక అర్హతగా టెట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా..త్వరలో చేపట్టనున్న గురుకుల విద్యాలయ నియామకాల్లో టెట్ మార్కులకు వెయిటేజీ ఇవ్వాలా? వద్దా? అన్న అంశంపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తోపాటు, రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖలోని వివిధ స్థాయిల్లో తాజాగా చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా టెట్ నిర్వహణలో లోటుపాట్లు తెరపైకి వచ్చాయి. అసలు టెట్, డీఎస్సీలు వేర్వేరుగా నిర్వహించాల్సిన అవసరం లేదని, కేంద్రం చెప్పిన పద్ధతిలో ఒకే పరీక్ష ద్వారా నియామకాలు నిర్వహిస్తే సరిపోతుందన్న విషయం స్పష్టమైనట్లు తెలుస్తోంది. ‘ఉపాధ్యాయ నియామకాల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో రూపొందిన జీవో 51నే తెలంగాణ విద్యాశాఖ ఇంకా అనుసరిస్తోంది. దాని (మిగతా 2లో)

# ‘టెట్’పై పునరాలోచన?

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారమైతే టెట్ తప్పనిసరి. ఒకవేళ ఆ జీవోను(తెలంగాణ ఏర్పడ్డాక ఇచ్చిన జీవో 36 కూడా కలిపి) సవరించుకుంటే డీఎస్సీ, టెట్ కలిపి నిర్వహించుకునే వెసులుబాటు ఉంది. ఆంధ్రప్రదేశ్ కూడా ఉమ్మడి రాష్ట్రంలోని జీవోను రద్దు చేసి ఇటీవలే ఒకే పరీక్ష నిర్వహించి(టెట్ లేకుండా) ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టింది. దీన్నిబట్టి చూస్తే..మన రాష్ట్రంలో కూడా అలా చేసుకునే వీలుంది" అని ఓ ఉన్నతాధికారి అభిప్రాయపడ్డారు.

## తొందరపాటు నిర్ణయంతో

ఎలాంటి పరీక్ష లేకుండా ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకూడదన్న(గతంలో హర్యానా, మధ్యప్రదేశ్‌లాంటి కొన్ని రాష్ట్రాలు అలా చేశాయి) ఉద్దేశంతో..కేంద్రం(ఎన్‌సీటీఈ) ఏదైనా ఓ వడపోత పరీక్ష ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించాలని అప్పట్లో ఆదేశించింది. అప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహిస్తున్నా..కేంద్రం ఆదేశాల అనంతరం అప్పటి విద్యాశాఖ హడావుడిగా టెట్ మార్గదర్శకాలు ప్రకటించింది. డీఎస్సీకి అదనంగా దేశంలోనే తొలిసారి టెట్ నిర్వహించింది. కాగా..డీఎస్సీ పరీక్షనే ఎన్‌సీటీఈ మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తే సరిపోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్న క్రమంలో..అనేక రాష్ట్రాల ప్రతినిధులు ఇక్కడి పరీక్ష విధానాన్ని అధ్యయనం చేశారు. పొరపాట్లను సవరించుకొని ఒకే పరీక్ష ద్వారా వారి రాష్ట్రాల్లో నియామక ప్రక్రియ చేపడుతున్నారు. ఇక్కడ మాత్రం అదే విధానం కొనసాగుతోంది. ఒకవేళ కేంద్ర చట్టం అందరికీ వర్తించే పక్షంలో మిగిలిన రాష్ట్రాల్లో ఒకే పరీక్ష ద్వారా నియామకాలు ఎలా చట్టబద్ధమవుతాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 'రాజ్యాంగ ప్రతిపత్తిగల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు డీఎస్సీ పరీక్ష నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. గురుకులాల్లో నియామకాలకు రెండు అంచెల్లో(ప్రిలిమ్స్,మెయిన్స్) పరీక్షలు నిర్వహించబోతున్నారు. మళ్లీ దానికి టెట్ అవసరం లేదు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షనే ఎన్‌సీటీఈ విధానానికి అనుగుణంగా మార్చుకుంటే సరిపోతుంది.' అని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ పాత విధానాన్నే కొనసాగిస్తుందా? సవరణకు చొరవ తీసుకుంటుందా? అన్నది తేలాల్సి ఉంది.